క్లుప్తంగా

సారాతో ఇద్దరు అరెస్టు

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి సారా కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జి.వి.రమణ సోమవారం తెలిపారు. కంచిలి మండలం గొల్ల కంచిలి గ్రామంలో కొల్లి చంద్రశేఖర్ అనే వ్యక్తి నుంచి 200, రాగుపురం గ్రామంలో బతకల కృష్ణమూర్తి వద్ద 100 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసి సోంపేట కోర్టులో హాజరు పరిచామన్నారు. వీరికి జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సై సుజాత, సిబ్బంది భానుప్రసాద్, మార్కారావు, విజయ్ పాల్గొన్నారన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



విద్య కిట్లతో విద్యార్థులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏపీ ట్రేడ్ చైర్మన్ వజ్జ బాబూరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, నాయకులు గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా, పీడీ పట్ట తవిటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

పలాస: కిష్టుపురం గ్రామంలోని యూపీ స్కూల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, ఏక రూపదుస్తులను సోమవారం పంపిణీ చేశారు. స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ మామిడి రోజ, యూనిట్ ఇన్‌చార్జి బి.కృష్ణంరాజు, ప్రధానోపాధ్యాయులు డి.వి.ఎస్.నారాయణ, గ్రామపెద్దలు తులసీరావు, ముకుందరావు, మోహనరావు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి నాగాభరణం వితరణ



దాతలు అందజేసిన వెండి నాగాభరణం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరం పరిసర ప్రాంతంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి గుణుపల్లి గ్రామానికి చెందిన జోగి ధనలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.2.50 లక్షల విలువైన వెండి నాగాభరణాన్ని వితరణగా సోమవారం అందజేసి భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు తామాడ సరస్వతి, బత్తిని తరిణయ్య, రుద్రమూర్తి, సాతుపల్లి కనకరాజు, మద్దు రాఘవరావు, లండ కోదండరావు, కె.జగన్ పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం



యోగా సాధనలో సచివాలయ సిబ్బంది, ప్రజలు

పలాస: యోగాను రోజు చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని పలాస ఉద్యాన వన శాఖాధికారి శంకర్‌దాసు అన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ యోగా దివ్యౌషధంగా పనిచేస్తోందన్నారు. బొడ్డపాడు గ్రామ సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. పలాస మండల ఉద్యాన వన శాఖాధికారి శంకర్‌దాస్, బొడ్డపాడు గ్రామ సర్పంచ్ తామాడ మదన్, సచివాలయం సిబ్బంది, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా సురేష్



కొంకేన సురేష్

కంచిలి: కంచిలి మండల వ్యవసాయాధికారిగా కొంకేన సురేష్ విధుల్లో సోమవారం చేరారు. ఈయన జలుమూరు మండల వ్యవసాయాధికారిగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఉన్న వ్యవసాయాధికారి బి. ధనుంజయ వజ్రపుకొత్తూరు మండలానికి బదిలీ అయ్యారు.

అప్రమత్తతతోనే వ్యాధులకు చెక్!



టెక్కలిలో జనావాసాల మధ్య మురుగు నీటి నిల్వలు

- వర్షా కాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తున్న వైద్యులు

టెక్కలి:

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురుస్తున్నాయి. ఇదే సమయంలో సీజనల్ వ్యాధులు కూడా పంజా విసురుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. దీంతో వ్యాధులు మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వీటికి తోడు కోవిడ్ ప్రభావం కూడా కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరిస్తే ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేయకుండా ఉండవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పగలు కుట్టే ఎడీస్ ఈజిప్ట్ అనే దోమ కాటుతో డెంగీ వ్యాధి ప్రబలుతోంది. ఈ వ్యాధి సోకినవారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కంటి లోపల కదలికలు తగ్గడం, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతులు, నోరు ఎండిపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకితే చలి, జ్వరం, విపరీతమైన తలనొప్పి తదితర లక్షణాలు కనిపిస్తాయి. మలేరియా దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి.

చికెన్ గున్యాతో జాగ్రత్త..

ఎడీస్ దోమ ద్వారా చికెన్‌గున్యా వ్యాధి ప్రబలుతుంది. ఇది సోకిన వారికి అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి,ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తాయి. చికెన్ గున్యా రాకుండా ముందస్తుగా పరిశుభ్రత చర్యలు పాటించాలి.

ఫైలేరియాపై మరింత జాగ్రత్త

ఫైలేరియా (బోదకాలు) వ్యాధి రాకుండా ముందస్తుగానే జాగ్రత్త చర్యలు పాటించాలి. మురుగు నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమ కాటుతో ఈ వ్యాధి ప్రబలుతుంది. మురుగు నీటిలో దోమల లార్వా వృద్ధి చెందకుండా కిరోసిన్, వేస్ట్ ఆయిల్ చల్లి దోమల లార్వాలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు పాటించాలి.

నివారణ చర్యలు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కొన్ని నివారణ చర్యలు పాటిస్తే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి పరిససరాలు పరిశుభ్రంగా ఉంచాలి. నీటి తొట్టెలు, టైర్లు, మురుగు కాలువల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి. కూలర్లు, ఫ్రిడ్జ్‌లతో పాటు బయట పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలి.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వేడి నీరు వినియోగించాలి. దోమ తెరలు వాడితే ఎంతో మంచిది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు బయట ఆహారం కంటే ఇంట్లో చేసుకునే వేడి ఆహారం ఎంతో ఉత్తమం. చేతులను పరిశుభ్రంగా ఉంచాలి. ఇంటి పరిసరాల్లో ఎటువంటి చెత్త, మురుగు నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి. కోవిడ్ ప్రభావం ఉన్న కారణంగా జాగ్రత్తలు పాటించాలి.

–పీఎస్ఎస్ పవన్‌కుమార్ తేజ, వైద్యాధికారి, పీహెచ్‌సీ, లింగాలవలస, టెక్కలి మండలం



సీజనల్ వ్యాధులతో చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి వచ్చిన రోగులు

నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్



కాశీబుగ్గలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని, పుస్తకాల పేర్లతో వేల రూపాయలు వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నార ని ఆరోపించారు. వేలాది రూపాయలను ఫీజులుగా వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సరైన వసతులు మాత్రం కల్పించడం లేదన్నారు. విద్యాసంస్థల దోపిడీని అరికట్టకపోతే త్వరలోనే ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు సాయికుమార్, సహాయ కార్యదర్శి గుణశేఖర్, నాయకులు విజయ్, చైతన్య, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తరగతి గదిలో ఫోకల్ స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

ఇచ్ఛాపురం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా నివారం సబ్‌యూనిట్ అధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. ఇచ్ఛాపురం పట్టణంలోని కేజీబీవీ, హాస్టల్‌ను మలేరియా సబ్‌యూనిట్ అధికారి సోమవారం సందర్శించారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు కేజీబీవీ తరగతి, హాస్టల్ గదులలో ఫోకల్ స్ప్రేయింగ్ చేపట్టారు. యూహెచ్‌సీ వైద్యులు ఎం.అఖిల్ మనోహర్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ నగేష్, సిబ్బంది రాఘవ, రఘునాథరావు ఉన్నారు.

పే స్కేల్ అమలు చేయాలి

పాతపట్నం: తెలంగాణాలో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలో వీఆర్ఏలకు కూడా పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలను వీఆర్ఏలుగా గుర్తించాలని పాతపట్నం మండల వీఆర్ఏలు పి.వి.రమణ, బి.రాజారావు, పి.అప్పలస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పండిత బాబీకి వీఆర్ఏలు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి డ్యూటీలు వేయించడం వెంటనే విరమించాలన్నారు. ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్ఏ పోస్టులను అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వై.రామారావు, బి.రవణమ్మ, ఆరుద్రమ్మ, దేవాది లక్ష్మి ఉన్నారు.

కంద్ర కులాన్ని బీసీ-ఏలో చేర్చడంపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు: కంద్ర కులాన్ని బీసీ-ఏ జాబితాలో చేర్చడంపై మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. పూండిలోని మత్స్యకార సమితి కార్యాలయంలో సోమవారం వీరు సమావేశమయ్యారు. మత్స్యకార సామాజిక సాంస్కృతిక సమితి సమావేశంలో మత్స్యకారుల సమస్యలపై చర్చించారు. మత్స్యకార సామాజిక వర్గంలో ఉన్న వాడబలిజ కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయ ని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమంతోపాటు తెలుగు మీడియాన్ని కూడా కొనసాగించాలని కోరారు. గత ప్రభుత్వం ఇంగ్లిష్ మాధ్యమం చేయడాన్ని అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ఒడిశా, తమిళనాడు, కర్ణాటక మొదలైన రాష్ట్రాలు మాదిరి గా ఇక్కడ కూడా తెలుగు మాధ్యంలో విద్యార్జన ఉండాలని.. అలా కాకపోతే తెలుగు భాషా సంస్కృతి సంప్రదాయాలు మరుగున పడి తెలుగు ఉనికినే కోల్పోతామన్నారు. సమితి అధ్యక్షుడు సూరాడ జోగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమి తి ప్రధాన కార్యదర్శి మైలపల్లి శ్రీనివాసరావు, పుక్కల్ల లక్ష్మణరావు, లండ రుద్రమూర్తి, గోపీనాథ్ కంద్ర, కొండ భీమారావు, సూరాడ వెంకటేష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 362 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కళాశాల ప్రతినిధులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని శ్రీ విద్యావాహిణి డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. 13 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 829 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరిలో 362 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల కరస్పాండెంట్ పైల తిరుమలరావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉదోగాల కోసం తిరగకుండా కళాశాలలో ప్లేస్‌మెంట్ పొందడం సంతోషకరమన్నారు. అన్నారు. అమేజాన్‌కు 52, ప్రీమియర్ ఎనర్జీ 48, టెలీఫెర్మార్మెన్స్ 38, వివిధ బ్యాంకులకు 32, అపోల ఫార్మసీ 25, మెడ్‌ప్లస్ 14, హెచ్ఐహెచ్‌ఆర్ 32, డబ్ల్యూఎన్ఎస్‌లో 26 మంది ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరికి ఆఫర్ లెటర్‌లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, డైరెక్టర్‌లు పి.సంధ్యారాణి, మన్మథరావు, ఏవో ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

కవిటి: కవిటిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను సోమవారం అందజేశారు. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బి.పవిత్ర (584), నెయ్యిల హాసిని (580), బైరెడ్ల హర్షిత (570) మార్కులు సాధించిన వీరికి వరుసగా రూ. ఐదు వేలు, రూ. మూడు వేలు, రెండు వేల రూపాయల నగదుతో పాటు జ్ఞాపికలను అందించారు. 1979–80 విద్యా సంవత్సరానికి చెందిన ఓల్డ్‌బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పండి బలరామ్మూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి ఏడాదికే డక్ అవుట్

- 'తల్లికి వందనం'లో పెద్ద ఎత్తున లూటీ
- టెక్కలిలో రౌడీ షీటర్లతో అచ్చెన్నాయుడు పరిపాలన
- 'వెన్నుపోటు'పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పేరాడ తిలక్, నాయకులు

టెక్కలి: రాష్ట్రంలో పెద్ద ఎత్తున దోపిడీ చేయడానికే చంద్రబాబు జనసేన, బీజేపీలతో జతకట్టి అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ విమర్శించారు. అధికారం చేపట్టిన మొదటి ఏడాదికే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక చంద్రబాబు డక్ అవుట్ అయ్యారని వ్యాఖ్యానించారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో 'వెన్నుపోటు' పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో తిలక్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అన్ని వ్యవస్థల్లో పెద్ద ఎత్తున దందాలు, మాఫీయాలతో కోట్లాది రూపాయల సంపద కొల్లగొట్టారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర నాయకులను పావులుగా వాడుకుని ఈ ప్రాంతంలో ఉన్న సంపదను అడ్డగోలుగా దోచుకున్నారన్నారు. తల్లికి వందనం పథకాన్ని అన్ని నిబంధనలతో ఇచ్చామని చెబుతూ ఒకే వ్యక్తికి 89 మంది పిల్లలు ఉన్నారంటూ ఆయా ఖాతాలకు సొమ్మును మళ్లించేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ పథకం ద్వారా పెద్ద ఎత్తున లూటీ చేశారని తిలక్ అన్నారు. కూటమి ఏడాది పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ప్రధానంగా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించి ఆ శాఖ మంత్రి నారా లోకేష్ విఫలమయ్యారన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న అచ్చెన్నాయుడు పూర్తిగా పాలనలో విఫలమయ్యారని గుర్తు చేశారు. సొంత జిల్లాలోనే రైతులను ఆదుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. టెక్కలిలో రౌడీ షీటర్లను అడ్డం పెట్టుకుని పాలన కొనసాగిస్తుండడంతో వ్యాపార వర్గాలతో పాటు మిగిలిన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. సొంత సామాజిక వర్గం పోలీస్ అధికారులతో ఆ వ్యవస్థను చెప్పు చేతల్లోకి తీసుకున్నారన్నారు. పోలీసులు సినిమా పోలీసులుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైనప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు ఇవ్వలేని దుస్థితిలో ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వైఫల్యం చెందారని పేర్కొన్నారు. కనీసం సాగునీటి కాలువలను సైతం మరమ్మతులు చేపట్టలేకపోయారన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు చేకూరిన లబ్ధి, కూటమి పాలనలో రైతు సంక్షేమంపై మాట్లాడేందుకు కూటమి నాయకులకు దమ్ముంటే రైతుల ముంగిటకు రావాలని తిలక్ సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై విజయోత్సవాలు చేసేందుకు సిద్ధమైన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. దీంతో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని విజయోత్సవాలను సైతం రద్దు చేసుకున్నారని అన్నారు. ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల మేలు కోసం పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పి.వసంత్‌రెడ్డి, నాయకులు ఆర్.మల్లయ్య, ఎస్.సత్యం, ఎస్.హేమసుందర్‌రాజు, కె.బాలకృష్ణారావు, టి.ఫాల్గుణరావు, ఆర్.లక్ష్మీకాంతం, ఎం.గణపతిరావు, పి.వెంకట్రావు, యు.తమ్మయ్య, ఎస్.వినోద్, చిన్ని జోగారావు, కె.అజయ్, కె.జీవన్, ఆర్.జయమోహన్, ఎ.రాహుల్, ఎం.అశోక్, జె.జయరాం, కె.నారాయణమూర్తి, ఎ.విష్ణు, కృష్ణారావు, ఎస్.జనార్దన్ రెడ్డి, నరేష్, రమేష్ తో పాటు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం'అనే పుస్తకాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం ఆవిష్కరించారు. పలాసలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, నాయకులు పానిల శ్రీనివాసరావు, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, దువ్వాడ మధు, గుజ్జు జోగారావు, బత్తిని హేమేశ్వరరావు, బమ్మిడి సంతోష్‌కుమార్, కంచరాన చినబాబు, నర్తు రమణ, శంకరరావు, బత్తిని లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఒరియా ఉపాధ్యాయులను నియమించాలి

పాతపట్నం: మండలంలోని చంగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒరియా ఉపాధ్యాయులను నియమించాలని, ఒరియా మాధ్యమంలో అన్ని సబ్జెక్ట్‌లను బోధించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం పాఠశాల వద్ద ఎంఈఓ-2 సి.హెచ్.తిరుమలరావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులు కలిసి ఎంఈఓకు ఒరియా ఉపాధ్యాయులు నియమించాలని, లేకపోతే హైస్కూల్ తమకు వద్దని వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గతంలో తెలుగు, ఒరియా పాఠశాలలు వేర్వేరుగా ఉండేవన్నారు. ఇప్పుడు ఉన్నత పాఠశాలగా ప్రభుత్వం ప్రమోట్ చేసిందని, ఇంగ్లిష్ మీడియంలో బోధనలు జరుగుతాయన్నారు. భవిష్యత్‌లో అన్ని పాఠశాలల్లోనూ ఇంగ్లిష్ మీడియం ఉంటుందని, ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించాలన్నారు. గ్రామస్తులు తెలిజేసిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఎంఈఓ తెలిపారు. హెచ్ఎం మురళీ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

వర్షా కాలంలో అప్రమత్తత అవసరం

హిరమండలం: భీకర గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖ డీఈఈ జి.శంకరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, చెట్లు కిందకు వెళ్లవద్దన్నారు. గాలులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని సూచించారు. రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు చాలామంది చెట్లు కిందకు వెళ్తుంటారని, అలా చేయడం చాలా ప్రమాదకరమన్నారు. చిన్నపాటి వర్షం కురవడం ప్రారంభం కావడం కాగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఇంట్లో ఉన్న కరెంట్ స్విచ్ బోర్డులు నుంచి ప్లగ్‌లు తీసి వేయాలన్నారు.



బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

మందస మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేసి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు అధికారులు ఘనంగా వీడ్కోలు పలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో-1, 2 ఎం.లక్ష్మణరావు, బి.ఎస్.సోలమన్‌లు ఉపాధ్యాయులను సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ.. ఏ పాఠశాలకు వెళ్లిన మందస మండలం పేరును నిలబెట్టాలని కోరారు. –మందస



ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఇచ్ఛాపురం మండలం కొఠారీ పంచాయతీలో సోంపేట ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ దుక్క ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగేదన్నారు. ప్రస్తుతం ఆ పథకం లేకపోవడంతో ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి సిబ్బంది ముందుకువచ్చి ఉచిత శిబిరాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం రూరల్



విద్యతోనే అభివృద్ధి

విద్యార్థులు విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట, జింకిభద్ర ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జింకిభద్ర సర్పంచ్ తామాడ పద్మావతి, ఉప సర్పంచ్ సాహుకారి జానీ, పంచాయతీ కార్యవర్గం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. –సోంపేట